క్లుప్తంగా

'బొత్స'కు శుభాకాంక్షలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనివాసరావు

పరవాడ : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవం కానున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనకు వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని బొత్స స్వగృహంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి ఇది తొలి విజయమన్నారు. చట్ట సభల్లో రాష్ట్ర భవిష్యత్‌పై బొత్స తన గళం వినిపించాలన్నారు. పేదలకు గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కొనసాగింపునకు తన వంతు కృషి చేయాలని పైల బొత్సను కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాలపై రచనలు చేసి, చిత్రలేఖనంలో ప్రతిభ చాటారు. విజేతలకు గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడు సి.హెచ్. జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన



కళాశాల విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

పరవాడ: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని యాక్సెప్ట్ ప్రోగామ్ మేనేజర్ బి.అనిల్‌కుమార్ సూచించారు. యాక్సెప్ట్ మైగ్రెంట్స్ ఆధ్వర్యంలో దేశపాత్రునిపాలెం, పరవాడ జూనియర్ కళాశాలలో 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్‌ఐవీ సంక్రమణ, నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు యాక్సెప్ట్ ప్రోగ్రాం సిబ్బంది కోదండ, ప్రసాద్, లత, గీత, కుమారి, మోహన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ముమ్మన దేముడు

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వన మహోత్సవం సందర్భంగా బుధవారం వార్డు పరిధిలోని పురుషోత్తపురం గౌరీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ భావితరాల మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి సోషల్ మీడియా కన్వీనర్ కోరాడ చందుయాదవ్, కాలనీ ప్రతినిధులు పి.వి. రమణమూర్తి, వై.సత్యనారాయణ, ఎం.కేశవరావు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

36 మంది మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 36 మందికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 36 మందిని రెండో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరచగా న్యాయమూర్తి వారందరికీ మొత్తం రూ.78,500 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

గంటి సాగు.. భలే బాగు

సబ్బవరం మండలంలోని మొగలిపురం, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, ఎల్లుప్పి, అమృతపురం, రాయపుర అగ్రహారం, టెక్కలి పాలెం, వంగలి గ్రామాల్లో గంటి సాగు పట్ల రైతులు శ్రద్ధ చూపుతున్నారు. ఇక్కడ దాదాపు 957 ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. సొంత అవసరాలకు, బయట విక్రయానికి కూడా అనువుగా ఉన్న గంటి పంటను రైతులు మరింత ఎక్కువగా సాగు చేసేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం తప్పనిసరి. అలా చేస్తే రైతులు మరింతగా గంటిని పండించగలరు.

- ఈ సాగులో జిల్లాలోనే ప్రథమ స్థానంలో సబ్బవరం మండలం
- వరికి ముందు సాగు చేసే పంట ఇదే
- మండలంలో సుమారు 957 ఎకరాల్లో సాగుబడి



రాయపుర అగ్రహారంలో కోత దశకు వచ్చిన గంటి



వంగలిలో గంటి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



రాయపుర అగ్రహారంలో సాగు చేస్తున్న గంటి

సబ్బవరం : మండలంలోని ప్రధానంగా రైతులంతా పిట్ట గంటి రకాన్ని ఎంచుకుని సాగు చేస్తున్నారు. గంటి వర్షాధార పంటగా మండలంలో సాగు అవుతోంది. సకాలంలో రెండు వర్షాలు పడినా దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. ఈ రకం గంటి దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ తినడానికి బాగుండటంతో పాటు ఆరోగ్యవంతంగా ఉండటంతో ఈ రకాన్ని సాగు చేయడానికి రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. రైతులు తాము పండించిన పంటలో 70 శాతం వరకూ సొంతానికి వినియోగించుకుని మిగిలిన పంటను బయటి మార్కెట్‌లో అమ్ముకుని మంచి ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

వేసవి పంటగా గంటి..

ప్రతి ఏటా మండలంలోని రైతులు వేసవి పంటగా గంటి సాగు, తొలకరి పంటగా వరి సాగు చేయడం వలన పంట మార్పిడి విధానంలో సాగు జరుగుతోంది. గంటి ఎన్నులు ఏరేసిన తర్వాత మిగిలిన చొప్పను భూమిలో కలియదున్నడం వల్ల భూసారం సైతం పెరుగుతోంది. భూమికి అవసరమయ్యే పచ్చిరొట్ట ఎరువుగా మారి నేలలో సేంద్రియ పదార్థం పెరుగుతోంది.

చక్కటి ఆదాయం..

మండలంలో సుమారు 957 ఎకరాల్లో గంటి సాగు జరుగుతోంది. ఎకరాకు సాధారణ దిగుబడి 380 నుండి 415 కిలోల దిగుబడి వస్తుంది. బయటి మార్కెట్‌లో సుమారు కిలో గంటి రూ.70 నుండి 100 వరకూ పలుకుతోంది. ఈ ఆదాయం రైతు అవసరాలకు చక్కగా సద్వినియోగం అవుతోంది.

పలు ప్రాంతాల్లో సాగు..

మండలంలో సబ్బవరం, మొగలిపురం, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, ఎల్లుప్పి, అమృతపురం, రాయపుర అగ్రహారం, టెక్కలి పాలెం, వంగలి గ్రామాల్లో రైతులు అధికంగా గంటి సాగు చేస్తారు. రైతులు తమ పంటలను పంట నమోదు చేసుకోవడం వల్ల పంట బీమా వర్తిస్తుందని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పంట కోత దశకు వచ్చింది.

ప్రభుత్వ ప్రోత్సాహం తప్పనిసరి..

గంటి సాగుపై రైతులు శ్రద్ధ చూపడంతో గంటి పంట చక్కటి దిగుబడులను ఇస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతైనా అవసరం. రైతులు పండించిన ఉత్పత్తులను దళారుల ద్వారా అమ్ముకుని నష్టపోకుండా ప్రభుత్వమే మద్దతు ధర కల్పించినట్లు అయితే ఈ పంట పట్ల రైతులు మొగ్గు చూపడమే కాకుండా సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుంది.

లాభాలు ఆర్జిస్తున్న బడా కంపెనీలు..

గ్రామీణ ప్రాంతాల్లో విలువ జోడింపు ఉత్పత్తులుగా చిరుధాన్యాల సాగును చెప్పుకోవచ్చు. అయితే ఇక్కడ వీటి వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ వీటి ద్వారానే బడా కంపెనీలు ఎక్కువగా లాభపడుతున్నాయి. బిస్కెట్లు, పొడులు తదితర ఆహార ఉత్పత్తులను విక్రయించడం ద్వారా పెద్ద ఎత్తున లాభాలు ఆర్జిస్తున్నాయి.

దేశ సమగ్రతకు అందరి తోడ్పాటు అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, చిత్రంలో బీజేపీ నేత మాధవ్

పెందుర్తి: దేశ సమగ్రతను కాపాడేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఆ దిశగా ప్రతీ ఒక్కరూ ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో పెందుర్తిలో బుధవారం నిర్వహించిన 'దేశ విభజన భయానకమైన రోజు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌కు స్వాతంత్య్రం వచ్చిన ముందు సమయంలో దేశ ప్రజలను ఎంతలా హింసించారో ప్రతీ ఒక్కరి మదిలో ఉంటుందన్నారు. తాజాగా దేశంలో ఎలాంటి అశాంతి లేకుండా చేసి, దేశాన్ని ప్రపంచ పటంలో అగ్రగామిగా ప్రధాని మోదీ తీర్చిదిద్దారని అన్నారు. ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామిగా ఉండడం రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తూ, కేంద్రం నుంచి నిధులను సమీకరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, అనకాపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వనం సత్యనారాయణ, పెందుర్తి ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరంగా.. సగర్వంగా..



పెందుర్తి వీధుల్లో మువ్వన్నెల పతాక సగర్వంగా సాగింది. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 78 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. దాదాపు 2 కిలోమీటర్లు జెండాను ఊరేగిస్తూ 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. కళాశాల కార్యదర్శి టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎన్‌ఈ ఫ్లోరా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– పెందుర్తి

క్విజ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ముఖ్య అతిథుల నుంచి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పాఠశాల విభాగంలో నిర్వహించిన నేషనల్ ఫ్రీడమ్ క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ ఎన్. రామకృష్ణ బుధవారం తెలిపారు. ఈ పోటీలను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు కె. మోహన్‌రాహుల్, ఉదయ్‌కుమార్, నందకిశోర్, సందీప్ బృందం విజయం సాధించింది. వీరికి ముఖ్య అతిథులు చీఫ్ ఆర్‌డీఏ కమిషనర్ శామ్యూల్ జొనాథన్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ స్టీఫెన్ జేమ్స్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులను గైడ్ చేసిన ఉపాధ్యాయులు డాక్టర్ టి. రాంబాబు, లైబ్రేరియన్ లక్ష్మణరావు, జానకీరామ్‌లను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వెంకన్నకు వైభవంగా కల్యాణోత్సవం



తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం



పూజలందుకుంటున్న స్వామి

పెందుర్తి : చాతుర్మాస్య దీక్షల్లో భాగంగా వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు తులాభారంతో మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే రమేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయక సంఘం ప్రతినిధులు

పెందుర్తి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును పెందుర్తి, సబ్బవరం మండలాల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందించారు. బుధవారం నగరంలోని పంచకర్ల నివాసంలో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై వీఆర్‌ఏలు చర్చించారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఉన్న వాచ్‌మెన్ డ్యూటీల నుంచి తమను తప్పించాలని, ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులను సీనియారిటీ పద్ధతిలో అర్హత కలిగిన వారితో భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని రమేష్‌బాబు వారికి భరోసా ఇచ్చారు.

ఇంటి ముందు నిలిపిన కారు మాయం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటి ముందు నిలిపిన కారు మాయమైంది. ఇంతవరకు బైక్‌లు, సైకిళ్లు ఎత్తుకుపోయిన దొంగలు ఇప్పుడు కార్లపై కన్నేశారు. ఆరిలోవ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. స్థానికుల ద్వారా తెలిసిన వివరాలిలా.. జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ వెటర్నరీ లేఅవుట్‌లో ఓ వ్యక్తి తన ఇంటి ముందు సోమవారం సాయంత్రం కారు పార్కింగ్ చేశాడు. మంగళవారం ఉదయం చూసేసరికి తన కారు కనిపించకపోవడంతో నిర్ఘాంతపోయాడు. ఎవరైనా ఎత్తుకెళ్లి ఎక్కడైనా విడిచి పెట్టారేమోనని చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. ఎక్కడా కారు ఆచూకీ కానరాకపోవడంతో మంగళవారం రాత్రి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లేఅవుట్‌లో కొందరు ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు ఆ కారును ఎత్తుకు పోయినట్లు ఓ సీసీ ఫుటేజీలో వెల్లడైంది. కానీ వారు ఆ కారును ఎటుగా తీసుకువెళ్లారనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన



ఎన్‌ఎస్‌టీఎల్ ట్రిడెంట్ వద్ద జాతీయ జెండాతో విద్యార్థులు

విశాఖ విద్య: జాతీయ జెండాతో ఎన్‌ఏడీలో విద్యార్థులు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌ఏడీ నారాయణ పాఠశాల విద్యార్థులు బుధవారం జాతీయ నాయకుల వేషధారణలో బాజీ జంక్షన్ నుంచి ఎన్‌ఏడీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌టీఎల్ ట్రిడెంట్ వద్ద జాతీయ జెండాను ప్రదర్శించారు. ఏజీఎం రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, కో–ఆర్డినేటర్ రామ్ నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా రాకపోకలకు అనుమతివ్వాలి



డాక్‌యార్డ్ విజయనగర్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న నేవీ ఉద్యోగులు, కార్మికులు

సింథియా : ఎస్‌బీసీ వంతెన మీదుగా రాకపోకలకు అనుమతివ్వాలని నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్, ఇండియన్ నేవీ సివిలియన్ ఎంప్లాయూస్ యూనియన్ ఆధ్వర్యంలో డాక్‌యార్డ్ ఉద్యోగులు, కార్మికులు విజయనగర్ గేటు వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి సింథియా వైపు ప్రయాణ మార్గంలో ఉన్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ బ్రిడ్జి పునర్నిర్మాణం కారణంగా మూసివేయడంతో అటుగా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నా రు. ఈ మార్గంలో వెళ్లే వారంతా బ్రిడ్జి మూసేయడంతో సుమారు 10 కిలోమీటర్లు దూరం ఎస్‌ఆర్ మీదుగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు. రోజూ ఎవరో ఒకరు ప్రమాదానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఎస్‌బీసీ వద్ద గల బ్రిడ్జి మీదుగా రాకపోకలకు అనుమతించాలని డిమాండ్ చేశారు.